క్లుప్తంగా

సీజనల్‌పై అప్రమత్తత అవసరం

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి కింద చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

శంకర్‌పల్లి: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ 2024–2025లో భాగంగా సోమవారం శంకర్‌పల్లిలోని పార్కులు, జనసంచరిత ప్రాంతాల్లో మాస్ క్లీనింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ.. శుచి, శుభ్రతతోనే వ్యాధులు ధరి చేరవన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ అంజనీకుమార్, పర్యావరణాధికారి ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలు తీర్చండి

ఎంపీడీఓకు స్థానికుల వినతి

మొయినాబాద్: మా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు.. రోడ్లపైనే మురుగునీరు పారుతోంది.. ఈగలు, దోమలు చేరుతున్నాయి.. దీంతో కాలనీలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయంటూ మండల కేంద్రంలోని గుల్షన్ కాలనీ వాసులు ఎంపీడీఓ సంధ్యతో మొరపెట్టుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపీడీఓకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుల్షన్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మిషన్ భగీరథ నీళ్లు కూడా రావడం లేదని చెప్పారు. డ్రైనేజీ లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు పారి గుంతలు ఏర్పడ్డాయని.. వాటిలో ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలు వస్తున్నాయన్నారు. ఈ సమస్యలపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా తమ కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మొయినాబాద్ సభ్యులకు చైర్మన్ పదవిని కేటాయించాలి

పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్



మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్: సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మొయినాబాద్ మండలం వారికే కేటాయించాలని పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ డిమాండ్ చేశారు. సోమవారం మొయినాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొయినాబాద్, షాబాద్ మండలాలు కలిపి సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ ఉందని.. ప్రతీసారి షాబాద్ మండలం వారికే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కట్టబెడుతున్నారన్నారు. సుమారు 25 సంవత్సరాలుగా మొయినాబాద్ మండలానికి చెందిన వారికి చైర్మన్ పదవి దక్కలేదని ఆరోపించారు. ఈసారి కచ్చితంగా మొయినాబాద్ మండలానికి చెందిన వారికే చైర్మన్ పదవిని కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, నాయకులు మల్లేశ్‌గౌడ్, మహేందర్‌ముదిరాజ్, జంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మినాజుద్దీన్, సత్యనారాయణ, రాములు, జంగయ్య, అనిల్‌ముదిరాజ్, నర్సింలు, మల్లేశ్‌గౌడ్, రామదాస్, విష్ణు, చైతన్య తదితరులు ఉన్నారు.

రైతు మహాసభలను విజయవంతం చేద్దాం

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కోశాధికారి మాణిక్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష వీడాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కోశాధికారి మాణిక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిసాన్ సంఘ్ జిల్లా, మండల కమిటీలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వరంగల్ సభలో రాహుల్‌గాంధీ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కామారెడ్డిలో జరగబోయే రాష్ట్ర మహాసభలకు రైతులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గౌరవ జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మండల కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అభయహస్తం బాండ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం సబ్సిడీ మేర రూ.500కే సిలిండర్ అందజేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పని చేస్తుందని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతామన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో 1454 మందికి అభయహస్తం బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు జగన్, మల్లేశ్, నాయకులు దేవేందర్, జనార్ధన్‌చారి, గ్రామస్తులు పాల్గొన్నారు.



నందిగామ: లబ్ధిదారులకు అభయహస్తం బాండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

చెర్కుపల్లిలో..

కొందుర్గు: మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో సోమవారం మహిళలకు గ్యాస్ కనెక్షన్ బాండ్లను పంపిణీ చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రేషన్ డీలర్ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్ మహిళలకు రూ.500 గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి బాండ్లను వారు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, వెంకటేశ్, రాజు, నర్సింలు, రామచంద్రయ్య పాల్గొన్నారు.



కొందుర్గు: చెర్కుపల్లిలో లబ్ధిదారులకు బాండ్లను అందజేస్తున్న నాయకులు

విశ్వవిద్యాలయానికి పేరు మార్చొద్దు

కలెక్టర్‌కు ఆర్యవైశ్యుల వినతి

షాద్‌నగర్‌రూరల్: పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం పేరును మార్చకుండా ఆయన పేరునే ఉంచాలని కోరుతూ సోమవారం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శశాంకకు ఆర్యవైశ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణం నుంచి ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్దఎత్తున కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ.. పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టాలని ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆనాడు తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు పొట్టిశ్రీరాములు తన ప్రాణాలను లెక్కచేయకుండా 58 రోజులు ఆమరణ నిరాహార దీక్షను చేపట్టారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి పేరును మార్చాలనే ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. తెలుగు ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన మహోన్నతులు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆర్యవైశ్యుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం పేరును యథాతథంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో నిర్మించే ప్రాజెక్టులు, కట్టడాలకు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రవికుమార్‌గుప్తా, లక్ష్మయ్యగుప్తా, వెంకటేశంగుప్తా, గందె సురేశ్, కిరణ్‌కుమార్, సరాపు రమేశ్, రామనాథం, మధు, వీరబ్రహ్మ శ్రీనివాస్, వినోద్‌కుమార్, ఎంసాని శ్రీనివాస్, తాటి విజయకుమార్, గుడిపల్లి త్రినాథ్, గుబ్బ శ్రీనివాసులు, నాగరాజు, ఎల్కుర్తి నారాయణ, నాగరాజు, తాటి రామచంద్రుడు, ఆగీరు రవికుమార్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్యులు

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి, తదితరులు

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: క్రీడల్లో గెలుపోటములు సహజమని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీఆర్ఆర్ స్టేడియంలో జోనల్‌స్థాయి అండర్ 14, 17 స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడా కారులకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు చేవెళ్ల స్వామి, జనార్ధన్‌రెడ్డి, దండు రాహుల్‌గుప్తా, రవీందర్‌నాయక్, అన్వర్, బండ మహేందర్‌గౌడ్, రాఘవేందర్, ఉపాధ్యాయులు సుశీల, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

చేవెళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లు పొందేందుకు ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించిందని చేవెళ్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీ.ఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకునేవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్ పాసైన అభ్యర్థులు లేదా సమాన అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు పొందాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నెం.99086 40914లను సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

షాద్‌నగర్: ప్రమాదవశాత్తు వాగులోపడి మృతి చెందిన అంజయ్య కుటుంబానికి ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం తాలుకా అధ్యక్షుడు మంగ వెంకటేశ్ ఆధ్వర్యంలో అంజయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. చెరువులు, కుంటలు నిండి అలుగులు పారుతున్నాయని, చెరువులు, కుంటల వద్దకు వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మృతుడి కుటుంబానికి తాలుకా ముదిరాజ్ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌వర్మ, బాల్‌రాజ్, పైలయ్య, అంజయ్య, రాములు, శంకర్, గిరిబాబు, అశోక్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

ఎంపీడీఓ సంధ్య



సిబ్బందికి పీపీఈ కిట్లు అందజేస్తున్న అధికారులు

మొయినాబాద్: గ్రామాల స్వచ్ఛత, పారిశుద్ధ్య నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని ఎంపీడీఓ సంధ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని చిలుకూరులో గురువారం పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు గ్రామాలను స్వచ్ఛతగా ఉంచడంతో పాటు తమ ఆరోగ్యాన్ని కూడా చూసుకోవాలన్నారు. ఆరోగ్యానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందికి పీపీఈ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, మండల వైద్యాధికారి అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుబయట చెత్త వేయొద్దు

తుక్కుగూడ: మున్సిపాలిటీ ప్రజలు చెత్త ఆరుబయట వేయకుండా సిబ్బందికి అప్పగించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ సూచించారు. సోమవారం స్వచ్ఛత హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. ఆరుబయట చెత్తవేయడం ద్వారా దోమలు, ఈగల సంఖ్య పెరిగి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని సూచించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

చండీ ఉపాసకుడు రేవల్లి రాజేశ్‌శర్మ

షాద్‌నగర్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని చండీ ఉపాసకుడు రేవల్లి రాజేశ్‌శర్మ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయాన్ని చండీ ఉపాసకుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించారు. దేవాలయ నిర్మాణంలో పాటించాల్సిన తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హిందూ దేవాలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దేవాలయాలు మన హిందూ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. దేవాలయాల పునర్నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజలందరూ భగవన్నామస్మరణను అలవర్చుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అనంతరం రేవల్లి రాజేశ్‌శర్మను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అన్మారి వెంకటయ్య, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, జగన్‌మోహన్‌రెడ్డి, పల్లి యాదయ్య, సిరిగిద్ద అంజయ్య, శ్రీనివాస్, విజయ్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్, సిరిగిద్ద యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



రేవల్లి రాజేశ్‌శర్మను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: హైదరాబాద్ బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలలో నాలుగు రోజుల పాటు సీబీఎస్ఈ క్లస్టర్ 7వ ఖోఖో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. అండర్ 14, 17, 19 విభాగాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 200 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి దాదాపు 5500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 24 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సోమవారం నిర్వహించిన వివిధ విభాగాలలో ఠాగూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. బాలికల విభాగంలో ఠాగూర్ పాఠశాల విద్యార్థినులు తమ ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించి ముందంజలో ఉన్నారు. బాలుర విభాగంలో తమ ప్రత్యర్థి జట్టుపై ఠాగూర్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. క్రీడలలో ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్న విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

పార్టీని బలోపేతం చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

నందిగామ: గ్రామంలోని బూత్‌స్థాయి నుంచే బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సిద్దాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు మంగలి రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారీగా సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అని అన్నారు. గత పదేళ్లుగా ప్రధాని మోదీ మన దేశాన్ని అగ్రగ్రామిగా నిలిపాడని వివరించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో రెండు వందలకు తగ్గకుండా సభ్యత్వం చేసి పార్టీని పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, సభ్యత్వ నమోదు ప్రముఖ్ గణేశ్, హరికృష్ణ, నవీన్, మల్లేశ్, నర్సింహ, మోహన్‌చారి, వంశీచారి, కొండల్‌చారి, సూరి, బైరమోని నర్సింహ, శివ, ఫెరోజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు ధరి చేరవని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని కొత్తపేట, కొండారెడ్డిపల్లి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా వ్యాధులు ధరి చేరవన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కొత్తపేటలో 46 మంది, కొండారెడ్డిపల్లిలో 40 మంది సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరం ఉన్నవారికి మందులను అందించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిత, ఎంపీఓ కిష్టయ్య, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



కొత్తపేటలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొందుర్గు: గర్భిణి, బాలింతలతో పాటు చిన్నారులు విధిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి సూచించారు. సోమవారం మండలంలోని చెర్కుపల్లి, విశ్వనాథ్‌పూర్ గ్రామాల్లో పోషకాహార వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరాణి మాట్లాడుతూ.. పోషకాహారం లభించే వంటకాలు, వాటి ఆవశ్యకతను వివరించారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని చిన్నారులకు అందించాలని, అప్పుడే సరైన ఎదుగుదల ఉంటుందన్నారు. గర్భిణులు పాలు, గుడ్లు ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛత సేవపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్, ఉపాధ్యాయులు కుమార్, అంగన్‌వాడీ టీచర్ అరుణ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించుకోండి

లోక్ అదాలత్‌లో రిటైర్డు జడ్జి సాంబశివుడు

చేవెళ్ల: వాహనదారులు పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ కేసులను పరిష్కరించుకునేందుకు ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు రిటైర్డు జడ్జి సాంబశివుడు అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో సోమవారం ట్రాఫిక్ కేసులపై లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసుల పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం 23 నుంచి 28వ తేదీవరకు ఉంటుందని తెలిపారు. మొదటిరోజు నిర్వహించిన లోక్ అదాలత్‌లో మద్యం తాగి వాహనాలు నడిపించిన కేసులు 128 పరిష్కరించబడినట్లు తెలిపారు. వీటికి గాను జరిమానాగా 3లక్షల 41వేల రూపాయలు విధించామన్నారు. పెండింగ్ కేసులు ఉన్న వ్యక్తులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, కోర్టు స్టాఫ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



కేసులను పరిష్కరిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివుడు, ట్రాఫిక్ సీఐ వెంకటేశం

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

షాబాద్: పశుపోషణలో పాడి రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుగుణ మాల రైతు ఉత్పత్తిదారుల సంఘం పాడి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిరైతులు మంచి పాల దిగుబడి పొందడం కోసం చేపట్టాల్సిన చర్యలపై రైతులకు వివరించారు. పశువులలో వచ్చే వ్యాధులైన నట్టల నివారణ, పొదుగువాపు వ్యాధి, నిరోధక టీకాలు, సంకర జాతి పశువులలో వచ్చే పునఃరుత్పత్తి సమస్యలు, దాణా యాజమాన్యం, మేలైన పశుగ్రాసం చూడి పశువులకు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. షెడ్ నిర్వహణ ఆధునిక యంత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మైక్రాల్ రిమిడిస్ ప్రమోటర్, సిద్దార్థ భావణాసి, ప్రొడక్షన్ మేనేజర్ ఎస్ రావు, రైతులు మల్లారెడ్డి, పీసరి మాధవరెడ్డి, వీర మల్లారెడ్డి, సురేశ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, మహేందర్‌రెడ్డి, శంకర్, ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్, ముద్దెంగూడ, మేడిపల్లి, కడుమూరు, పాడి రైతులు ఉన్నారు.



పాడిపశువుల కోసం పౌడర్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న మేనేజర్ రత్నాకర్

రోడ్డు పనులు పూర్తయ్యేలా చూడండి

ఎమ్మెల్యే సబితారెడ్డికి స్థానికుల వినతి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీ 19వ వార్డులో గతంలో శంకుస్థాపన చేసిన రహదారుల పనులను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక కౌన్సిలర్ పల్లపు శంకర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానికులతో కలిసి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. 19వ వార్డులో రూ.50 లక్షల వ్యయంతో ఆరు రహదారులకు గతంలో శంకుస్థాపన చేశారని, ఇందులో మూడు రోడ్లను తవ్వి కంకర పరిచారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత కాంట్రాక్టర్ మాత్రం ప్రస్తుతం ఆ పనులపై నిర్లక్ష్యం వహించడంతో కంకర పరిచిన రహదారులపై రాకపోకలు సాగించలేక స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయమై స్పందించిన ఆమె వెంటనే మున్సిపల్ డీఈకి ఫోన్ చేసి వారంలో పనులు ప్రారంభించాలని ఆదేశించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆరు రోడ్లు పూర్తయితే వార్డులో 80శాతం మేర రోడ్లు అభివృద్ధి చెందినట్టేనని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు బాబు, మారుతీ, ఆవుల రవి, శంకర్, శ్రీకాంత్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564